క్లుప్తంగా

స్థూపం ఏర్పాటుపై అభ్యంతరం



జనసేన నాయకులు ఏర్పాటుచేసిన స్థూపం

ఏలూరు రూరల్ : ఏలూరులోని గాంధీ జ్ఞాన మందిర్ పరిసరాల్లో రాజకీయ నాయకుల స్థూపం ఏర్పాటుపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక 17వ డివిజన్‌లో జ్ఞాన మందిర్ వద్ద జనసేన పార్టీ నాయకులు సుమారు 20 అడుగుల ఎత్తులో స్థూపం నిర్మిస్తున్నారు. దీనిపై రిటైర్డ్ డీఎస్‌డీఓ కేటీఎస్‌ఆర్ ఆంజనేయులు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో మహాత్మాగాంధీ ఏలూరుకు విచ్చేశారని గుర్తు చేశారు. ఆ సమయంలో ఉప్పు సత్యాగ్రహానికి మద్దతుగా కొందరు వ్యక్తులు జ్ఞానమందిర్ వద్ద నిరసన చేపట్టారని, అంతటి ప్రాముఖ్యత గల స్థలంలో కార్పొరేషన్ అధికారులు గాంధీ పేరుతో జ్ఞాన మందిర్ నిర్మించారని వివరించారు. పార్టీలకు అతీతంగా ఉండాల్సిన ఈ ప్రాంతంలో నేడు రాజకీయ పార్టీల నాయకులు ఇష్టానుసారంగా పార్టీల స్థూపాలను నిర్మిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మందిర్ పరసరాలను పార్కుగా అభివృద్ధి చేయాలని, స్థూపం నిర్మాణాన్ని నిలుపుదల ఆయన అధికారులను కోరుతున్నారు.

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఎన్నిక



ఎర్ర రాంబాబు, నారపల్లి రమణారావు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా ఎర్ర రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా నారపల్లి రమణారావు ఎన్నికయ్యారు. ఏలూరులో గురువారం 6వ జిల్లా మహాసభలు ముగిశాయి. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా డీఎన్‌వీడీ ప్రసాద్, కోశాధికారిగా రెడ్డి లక్ష్మణరావు, జిల్లా ఉపాధ్యక్షులుగా తాడి సత్యనారాయణ, షేక్ బాషా, కెల్లా దుర్గాప్రసాద్, ఎం ఇస్సాక్, జిల్లా సహాయ కార్యదర్శులుగా సీహెచ్ కొండలరావు, ఆది కృష్ణ, సీర అప్పారావులు ఎన్నికయ్యారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు వెంటనే పునరుద్ధరించాలని, పెండింగ్ క్లైములు వెంటనే పరిష్కరించాలని, భవన నిర్మాణ మెటీరియల్ ధరలు తగ్గించాలని మహాసభలో తీర్మానించారు. పై డిమాండ్ల పరిష్కారానికి భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నూతన కమిటీ నిర్ణయించింది.

గణనాథులకు తుది మెరుగులు

- విభిన్న ఆకృతుల్లో గణపతి ప్రతిమలు
- పలు ప్రాంతాల్లో అమ్మకాలు
- మట్టి బొమ్మలకు డిమాండ్



నగరంలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వివిధ ఆకృతుల్లోని గణనాథుల విగ్రహాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వినాయక చవితి పండుగ దగ్గరకు వచ్చేసింది. మరో ఐదు రోజుల్లో గణపతి నవరాత్రి మహోత్సవాలు నగరంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ మహోత్సవాలకు అన్నింటికీ మించి ముఖ్య ఆకర్షణగా నిలిచేది గణపతి ప్రతిమలే. ఉత్సవాలు ప్రారంభమైన నాటి నుంచి ఉత్సవాలు ముగిసే వరకు నగరంలో ఏ ప్రాంతంలో ఎవరు పెద్ద ప్రతిమలు నిలబెట్టారు, ఎవరు విభిన్న ఆకృతుల్లో నిలబెట్టారు, ఎక్కడి ప్రతిమలు ఆకర్షణీయంగా ఉన్నాయి అనే ఉత్సుకత భక్తుల్లో ఉంటుంది. ఏలూరు నగరంలోని అన్ని ప్రాంతాలకు వెళ్లి ప్రతిమలను చూసి వద్దామనుకునే వారు కూడా చాలా మందే ఉంటారు. అటువంటి వారి కోసం తమ కమిటీ ప్రతిష్ఠాత్మకంగా ఉత్సవాలు నిర్వహించింది అనిపించుకోవడం కోసం పోటీలు పడడం ఇటీవల ఎక్కువగానే కనిపిస్తోంది. ఉత్సవ కమిటీల అభిరుచుల మేరకు ఉత్సవాలను రూపొందించడంలో తయారీదారులు సైతం పోటీ పడుతున్నారు.

వాడవాడల చలువ పందిళ్లు

ఉత్సవాల కోసం నగరంలోని ప్రధాన కూడళ్లలో ఇప్పటికే పందిరి రాట వేసిన ఉత్సవ కమిటీలు ఇప్పుడు పెద్ద పెద్ద పందిళ్లు, వివిధ రకాల సెట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. మినీ బైపాస్ రోడ్డులో పోస్టల్ కాలనీ, జీఎన్‌టీ రోడ్డు ప్రాంతాల్లో వినాయక ప్రతిమలు తయారు చేసే పనిలో రాజస్థానీ కళాకారులు రేయింబవళ్లు కష్టపడుతున్నారు. నగరంలోని ఒన్‌టౌన్‌లో మూడు ప్రాంతాల్లో భారీ ప్రతిమలు నిలబెట్టే సంప్రదాయం వస్తోంది. ఈ సారి కూడా ఆయా కమిటీలు భారీ ప్రతిమలు నిలబెట్టడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మిగిలిన ప్రాంతాల్లో అంటే నగరంలోని 50 డివిజన్లలోనూ ఎక్కడో ఒక చోట పందిరి దర్శనమిస్తోంది.

ఆ రూపాలు కడు రమణీయం

నవరాత్రి ఉత్సవాలకు బొజ్జ గణపయ్యను వివిధ ఆకృతుల్లో రూపుదిద్దుతున్నారు. ఆయా ప్రతిమలకు ఆకర్షణీయమైన రంగులు అద్దుతున్నారు. ఇప్పటికే ఉత్సవ కమిటీలు ఇచ్చిన ఆర్డర్ల మేరకు ప్రతిమలను సిద్ధం చేశారు. గృహాల్లో చేసుకునే చవితికి సైతం చిన్నచిన్న ప్రతిమలను కూడా ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. గజ ముఖుని ప్రతిమలు విభిన్న రూపాల్లో తయారు చేస్తూ ఆకట్టుకుంటున్నారు. సింహాసనం మీద కూర్చున్నట్టు, పార్వతీ పరమేశ్వరుల మధ్యలో గణపయ్య, సుబ్రహ్మణ్యం స్వామి అవతారంలో, కాణిపాకం వినాయకుడిలా, ఎక్కువ చేతులతో, నెలవంకపై పడుకున్నట్టు, శ్రీకష్ణుని అవతారంలో, వెంకటేశ్వర స్వామి రూపంలో, త్రిముఖం, పంచముఖాలతో ప్రతిమలను రూపుదిద్దుతున్నారు.

రూ.4 వేల నుంచి రూ.లక్ష వరకు విక్రయం

ఇక్కడ తయారు చేస్తున్న ప్రతిమలు రూ.4 వేల నుంచి రూ.లక్ష వరకూ ఉన్నాయి. చిన్న ప్రతిమలు రూ.3 వేలకు, పెద్ద పెద్ద ప్రతిమలను రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు విక్రయిస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఉత్సవ కమిటీల ప్రతినిధులు వారికి కావాల్సిన ప్రతిమలను తయారు చేయించుకొన్నారు. ఆయా ప్రతిమలపై వారి ఆర్డర్ నెంబర్లు వేయించుకుంటున్నారు. కొందరు తమకు కావాల్సిన ఆకతుల ప్రకారం బొమ్మలు తయారు చేయాలని తయారీదారులకు ఆర్డర్లు ఇచ్చారు. రూపం ఎలా ఉండాలి.. ఏయే రంగులు వేయాలో వారే నిర్ణయిస్తున్నారు. దాని ప్రకారం వాటిని తయారు చేయించుకున్నారు.

మట్టి బొమ్మలకు ఆదరణ

ఎక్కువగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ బొమ్మలనే తయారు చేస్తాం. కానీ ఈ ఏడాది మట్టి గణపతుల ప్రతిమలకు ఆదరణ ఎక్కువగా ఉంది. వినాయక చవితికి రెండు నెలల ముందు నుంచే ఆర్డర్లు ఇచ్చారు. మా వద్ద రూ.5 వేల నుంచి రూ.ఒక లక్ష వరకు విలువైన బొమ్మలు ఉన్నాయి. ఆర్డర్ల ప్రకారం, కమిటీల సూచించిన మేరకు ప్రత్యేకంగా గణపతిని తీర్చిదిద్ది అందిస్తున్నాం. కమిటీ ప్రతినిధులు ముందుగా ఆర్డర్లు ఇచ్చి వారికి కావాల్సిన రూపాలను తయారు చేయించుకుంటున్నారు. కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కుతోంది.

– పాయల్ బోర్సా, రాజస్థానీ కళాకారిణి

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ఏలూరు (టూటౌన్): శ్రీకాకుళంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర సదస్సు విజయవంతమైందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాస రావు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏలూరులో వారు విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలనే ఏకైక లక్ష్యంతో శ్రీకాకుళంలో సదస్సును నిర్వహించమని తెలిపారు. పలు తీర్మానాలను ఆమోదించామన్నారు. హక్కుల సాధనకై అన్ని అసోసియేషన్ల సహకారంతో ఏపీ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ బలోపేతం చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు మ్యారేజ్ స్కీం, సహజ మరణం అయితే ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని, ప్రమాదంలో మరణిస్తే పరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బిల్డింగ్‌లపై వసూలు చేస్తున్న సెస్ విధానం కార్మికులకే అందజేసి, ఎలక్ట్రీషియన్లకు బ్యాంకు రుణాలు అందజేసి, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని తీర్మానించినట్టు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేయన్నామని శ్రీనివాసరావు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పెదవేగి ఎంఈఓ-1పై ఫిర్యాదు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రామచంద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒకే ఒక్క సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ పెదవేగిలో పాఠాలు చెప్పాలని నిబంధనలకు విరుద్ధంగా ఈ నెల 4న మౌఖిక ఆదేశాలతో డిప్యూటేషన్‌పై పంపిన పెదవేగి ఎంఈఓ-1పై చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ 1938 సంఘ నాయకులు గురువారం డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు. ఆ డిప్యూటేషన్ రద్దు చేయాలని కోరారు. ఐతే ఎంఈఓ-1 బి.త్రిపుర సుందరీ దేవి నిర్భీతిగా తానేమి తప్పు చేయలేదని ఏపీటీఎఫ్ 1938 అల్లరి పాలు చేస్తున్నారని పత్రికా ముఖంగా ఖండించడం శోచనీయమని పేర్కొన్నారు.

వైకల్యం గుర్తింపు, నివారణపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న డీడీఆర్‌సీ సిబ్బంది

ఏలూరు (టూటౌన్): కండ్రికగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో 2016 దివ్యాంగుల హక్కుల చట్టంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది మాట్లాడుతూ వైకల్య నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైకల్యం గుర్తింపు, వైకల్యం వచ్చిన తర్వాత ఎదుర్కోవాల్సిన విషయాలపై అవగాహన కల్పించారు. రక్త సంబంధీకులతో వివాహం, 18 ఏళ్లలోపు వివాహాలు, గర్భధారణ వద్దని హెచ్చరించారు. దివ్యాంగులను 21 రకాలుగా గుర్తిస్తారని, ప్రభుత్వం దివ్యాంగులకు అందించే హక్కులను వివరించారు. సంస్థ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ డీడీఆర్‌సీ కేంద్రం ద్వారా క్యాంపులు నిర్వహించి దివ్యాంగులను గుర్తించి, ఫిజియోథెరపీ, ఆడియోలాజి, సైకలాజి సేవలు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 08812 – 249297, 73865 65469లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీడీఆర్‌సీ కేంద్రం సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు(ఆర్ఆర్‌పేట): నగరంలోని సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల నిర్వహణ నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కోటదిబ్బ సబ్‌స్టేషన్ పరిధిలో రిక్షా ఘాటీ, ఏడు గోలీల సెంటర్, సాంబారు పునుకుల సందు, వేణుగోపాలస్వామి టెంపుల్, విజయలక్ష్మి థియేటర్, బుద్ధా పార్క్, పంట కాలువ రోడ్డు, టీచర్స్ కాలనీ, హెడ్‌పోస్టాఫీస్ ఏరియా, పెరుగుచెట్టు, బిర్లాభవన్ సెంటర్, వైఎంహెచ్ఏ హాలు ఏరియా, మార్కెట్ ఏరియా, అంబికా థియేటర్, కెనాల్ రోడ్డు, నవాబ్ పేట, బావిశెట్టివారిపేట, నల్లదిబ్బ, మున్సిపల్ ఆఫీసర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వెంకన్న ట్యాంకు, పోణంగి ఫీడర్ పరిధిలో ఉన్న పడమరవీధి, వంగాయగూడెం, సుబ్రహ్మణ్య కాలనీ, గొల్లాయిగూడెం, గాంధీ కాలనీ, అరుంధతీపేట, కొబ్బరితోట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని తెలిపారు.

రేపు మాదేపల్లి సెక్షన్ పరిధిలో..

పోణంగి సబ్‌స్టేషన్‌లో వైఎస్సార్ కాలనీ, పోణంగి రోడ్డు, వీఎస్ఆర్ గ్రాండ్ సిటీ, రాజరాజేశ్వరి నగర్, శ్రీరామనగర్ కాలనీ, జగనన్న కాలనీల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

నేడు ఏలూరు రూరల్‌లో..

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం తిమ్మన్నగూడెం, కోటేశ్వర దుర్గాపురం, చాటపర్రు, దుర్గా గ్రాండ్ సిటీ, అందాలమ్మ తోట, రామనగర్, మారుతి నగర్, మస్తాన్ మందిర్ కాలనీ, నాగేంద్ర కాలనీ, శ్రీరామ్ నగర్ కాలనీ, శాస్త్రి కాలనీ, చెంచుల కాలనీ, ఆటోనగర్, కొమడవోలు, తూర్పులాకులు, సాయి నగర్, ఎన్‌టీఆర్ కాలనీ, పాలగూడెం, ఇందిరమ్మ కాలనీ గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ అంబేద్కర్ తెలిపారు.

ఈ రోడ్డుపై ప్రయాణానికి ఇక్కట్లు

దెందులూరు: పోతునూరు, ఉండ్రాజవరం మీదుగా జాతీయ రహదారి వైపు ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన రోడ్డుపై ఇటీవల వర్షాలకు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, స్కూల్‌లకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వాహనాలు ఆ మార్గంలో ప్రయాణిస్తున్నప్పుడు తమపై ఎక్కడ పడతాయో అని ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. నిత్యం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల ప్రజలు అవసరాల రీత్యా నిత్యం వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుకు నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించకపోవడం, పాలకులు చూసి చూడనట్లు వ్యవహరించడం. అధికారులు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ప్రమాదాలు చోటు చేసుకోకుండా మానవత్వంతోనైనా అధికారులు స్పందించి గుంతలు పూర్తిగా పూడ్చేందుకు చొరవ చూపాలని వాహనదారులు గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

నేడు చేతి వృత్తిదారుల జిల్లా కమిటీ సమావేశం

ఏలూరు (టూటౌన్): చేతి వృత్తిదారుల జిల్లా సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆర్ఆర్‌పేటలోని వృత్తి సంఘాల కార్యాలయంలో నిర్వహించనున్నట్టు జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, జిల్లా కోకన్వీనర్ ఆగొల్ల వెంకట కృష్ణారావులు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ కార్పొరేషన్ల నుంచి వృత్తిదారులకు 90 శాతం సబ్సిడీతో రుణాలు ఇవ్వాలని, కొన్ని వృత్తుల్లో ఉన్న ప్రజలకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. ఆదరణ పథకంలో వృత్తిదారులకు అవసరమైన పరికరాలు అందజేయాలని, వృత్తిదారులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు బకాయిలు వెంటనే చెల్లించాలని, బెల్ట్ షాపులు వెంటనే తొలగించాలని, గీత కార్మికుల ఉపాధి కల్పనకు నీర పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు. రజక వృత్తిదారులకు వృత్తి చెరువులపై వారికే పూర్తి హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రానున్న రోజుల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

సచివాలయంలో చోరీ

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని కోటదిబ్బ సచివాలయంలో నగదు, కంప్యూటర్ సీపీయూ చోరీకి గురయ్యాయి. రికార్డులను సైతం చింపేవారు. సచివాలయం అడ్మిన్ ఇన్‌చార్జ్ ఇస్లావత్ నాగరాజు బుధవారం రాత్రి 8 గంటలకు సచివాలయ కార్యాలయానికి తాళాలు వేసి వెళ్లారు. గురువారం ఉదయం 9 గంటలకు కార్యాలయానికి వెళ్లి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. సచివాలయం లోపల టేబుల్ సొరుగులో రూ.4 వేలు, కంప్యూటర్ సీపీయూను అపహరించుకుపోయారు. రికార్డులన్నీ చింపివేసి చిందరవందరగా పడవేశారు. ఈ ఘటనపై ఏలూరు పోలీసులకు నాగరాజు ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ ఎస్సై మదీనా బాషా ఘటనా స్థలంలో పరిశీలన చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

గుర్తించలేని స్థితిలో మృతదేహం

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఒక అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతూ ఉంది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ ఎస్సై మదీనా బాషా ఘటనా స్థలిలో మృతదేహాన్ని పరిశీలించారు. అనుమానస్పద మృతిగా కేసు దర్యాప్తు చేపట్టారు. ఏలూరు గోపాలకృష్ణ థియేటర్ సమీపంలో తుమ్మపూడి నాగవెంకట జగన్మోహనరావుకు చెందిన మూడు అంతస్తుల భవనం నిర్మాణం చేపట్టారు. సెల్లార్‌లో మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, చాలా రోజులు కావటంతో గుర్తుపట్టలేని స్థితిలో మృతదేహం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

దివ్యాంగుల వెతలు



ఫిర్యాదు చేయడానికి వచ్చిన దివ్యాంగులు

కొయ్యలగూడెం: సెప్టెంబర్ నుంచి పెన్షన్లు రద్దు చేస్తున్నామని ప్రభుత్వం నోటీసులు ఇవ్వడంతో పలువురు దివ్యాంగులు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. అన్ని అర్హతలూ తమకు ఉన్నా అనర్హులుగా ఎందుకు నిర్ధారించారంటూ అధికారులను నిలదీశారు. కొయ్యలగూడెంకి చెందిన వితంతువు, 90 శాతం వికలాంగురాలైన డిమ్మెల పద్మజ తనకు ధ్రువీకరణ పత్రం ఉన్నా అనర్హురాలిగా పేర్కొన్నారని వాపోయింది. వచ్చే నెల నుంచి పింఛన్ నిలిపివేస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారని తెలిపింది. తనకు న్యాయం చేయాలని పలువురు లబ్ధిదారులు ఎంపీడీఓ కె.కిరణ్‌కుమార్‌కు దరఖాస్తులు అందజేశారు. సుమారు 15 మందికి పైగా దరఖాస్తులు చేసుకోగా 116 మందికి అధికారికంగా, 200 మందికి పైగానే లబ్ధిదారులకు అనధికారికంగా పింఛన్లు రద్దయినట్టు తెలిసింది.

పాత పింఛన్ విధానం అమలు చేయాలి



పోస్టర్ విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

జంగారెడ్డిగూడెం: 2003 డీఎస్సీ వారికి కేంద్ర ప్రభుత్వం పాత పింఛన్ ఇవ్వాలని కోరుతూ ఈ నెల 25న విజయవాడలో ధర్నా చౌక్‌లో ధర్నా చేయనున్నట్టు 2003 డీఎస్సీ ఫోరం, ఏలూరు జిల్లా కన్వీనర్ ఎన్ ఏసురత్నం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57లో 2004 ముందు నోటిఫికేషన్ల ద్వారా జాయిన్ అయిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధాన అమలు చేయాలని పేర్కొందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నేటికీ వారికి పాత పెన్షన్ విధానం అమలు చేయకుండా కొత్త పెన్షన్ విధానంలోనే ఉంచిందని తెలిపారు. 2003 డీఎస్సీ వరకు వెంటనే పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ధర్నా పోస్టర్‌ను విడుదల చేశారు. ఏపీ సీపీఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి ఆర్ నారాయణ దుర్గారావు, యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎంవీ శ్యాంబాబు, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఐవీ రత్నం, బీటీఏ రాష్ట్ర నాయకులు బి.రామారావు, మండల అధ్యక్షుడు కె.రాజా, యూటీఎఫ్ మండల కార్యదర్శి టి.రామకృష్ణ, పవన్, మస్తాన్ వలి, నాగార్జున, రాంబాబు, సుభాషిని, స్వర్ణలత పాల్గొన్నారు.

భోజన కార్మికుల పొట్టకొట్టొద్దు

గణపవరం: ఏళ్ల తరబడి పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల పొట్టకొట్టే ప్రయత్నాలు విరమించుకోవాలని ఆ పథక కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం మండల సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఎంఈవో కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లి ఎంఈవో బాలయ్యకు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట చేస్తూ, ప్రభుత్వ మెనూను కష్ట నష్టాల కోర్చి అమలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం వేడివేడిగా అందిస్తున్న తమను కాదని దూర ప్రాంతాల నుంచి ఏజెన్సీల ద్వారా భోజనాలు తెప్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం సరికాదని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు నినాదాలు చేశారు. తూర్పు గోదావరి జిల్లా నుంచి గణపవరం మండలానికి భోజనాలు వాహనాల్లో చేర వేసి విద్యార్థులకు పెట్టడం క్షేమదాయకం కాదన్నారు. ఈ నిర్ణయం వెనక్కి తీసుకోకుంటే మధ్యాహ్న భోజన కార్మికులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తారని హెచ్చరించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	46	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	00
వంకాయలు (కాంతులు)	24	బీన్లచిక్కుడు	100
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	36
బెండకాయలు	28	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	44	కంద	00
కాకర కాయలు	24-28	బీట్‌రూట్	38
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	40-48	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	28	పాలకూర	10
బంగాళదుంపలు	36	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20-24	పుదీనా	05
అనబకాయ (1)	20-30	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	46

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	29
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	37
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	45
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	10
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	28
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	28
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	31
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	26
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	37
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

హామీల అమలులో 'కూటమి' విఫలం



డీఎన్ రావు పేటలో నిర్వహిస్తున్న 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'



లింగగూడెం గ్రామంలో పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

- వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు జానకిరెడ్డి
- గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాలు

చింతలపూడి : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు జగ్గవరపు జానకి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం చింతలపూడి మండలం మల్లాయిగూడెం, డీఎన్‌రావు పేట, లింగగూడెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రబాబు మోసాలు వివరించే క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను విడుదల చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎస్ రమేష్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన గ్రామ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. డీఎన్‌రావుపేటలో జానకిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల్లో ఏదో విధంగా గెలవాలన్న ఉద్దేశంతో అలవికాని హామీలు ఇచ్చారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేసిన ఘనత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని వివరించారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నీరజ సుధాకర్, మహిళా ప్రెసిడెంట్ చింతం, సోషల్ మీడియా కన్వీనర్ నరసింహారావు, గ్రీవెన్స్ సెల్ దాస్, మండలం క్రిస్టియన్ మైనారిటీ సెల్ గొంది రాజు, ప్రగడవరం సర్పంచ్ భూపతి, ఎంపీటీసీ నాగలక్ష్మీ రమేష్, కిషోర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లాయగూడెం, లింగగూడెం గ్రామాల్లో..

మోసానికి సీఎం చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ లాంటివారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎస్ రమేష్ రెడ్డి ఆరోపించారు. మల్లాయగూడెం, లింగగూడెం గ్రామాల్లో పార్టీ గ్రామ విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించడానికి బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం గ్రామ గ్రామానా నిర్వహిస్తున్నామని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అరకొరగా అమలు చేస్తూ పాలకులు ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు జానకి రెడ్డి, ఎంపీపీ బి.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ నీరజా సుధాకర్, రాణి, మండల కార్యదర్శి బాబూరావు, యూత్ ప్రెసిడెంట్ సురేష్, జగన్నాథం, జోషి, ధర్మారావు, పచ్చిగోళ్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.